నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, మంగళవారం 16 ఏప్రిల్ 2024 | KARIMNAGAR

ముగ్గురికి చార్జ్ మెమోలు

కొండగట్టు ఆలయ ఉద్యోగులకు జారీ చేసిన ఈవో

నమస్తే ఎఫెక్ట్

మల్యాల, ఏప్రిల్ 15 : కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలోని ముగ్గురు ఉద్యోగులకు కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ సోమవారం చార్జ్ మెమోలు జారీ చేశారు. అంజన్న ఆలయ పరిధిలో దుకాణాల లీజు సొమ్ము పక్కదారి పట్టడంతో దేవాదాయ, ధర్మాదాయ శాఖ అదనపు కమిషనర్ జ్యోతి విచారణ జరిపి, నివేదికను కమిషనర్‌కు సమర్పించిన విషయం తెలిసిందే. దానిని పరిశీలించిన కమిషనర్ హన్మంతరావు ఆలయంలో పనిచేసే సంబంధిత సెక్షన్ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మార్చి 23న ఆదేశాలు జారీ చేశారు. అయినా, సదరు ఉద్యోగులపై ఎలాంటి చర్యలూ తీసుకోకపోవంతో 'నిర్లక్ష్యపు ఉద్యోగులపై చర్యలేవి?' అనే శీర్షికన సోమవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి ఈవో చంద్రశేఖర్ స్పందించారు. ఈ క్రమంలోనే ఆలయంలో పనిచేస్తున్న ఇద్దరు పర్యవేక్షకులతోపాటు ఇటీవలే కొండగట్టు నుంచి కొమురవెల్లికి బదిలీ అయిన ఏఈవోకు సోమవారం చార్జ్ మెమోలు జారీ చేశారు. చార్జ్ మెమోలు అందుకున్న ఉద్యోగులు 15 రోజుల్లోపు సంజాయిషీ ఇవ్వాలని, లేనిపక్షంలో తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

సమావేశానికి హాజరైన ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి వినోద్‌కుమార్, పక్కన మేయర్ సునీల్‌రావు

జగిత్యాల జిల్లాలో కొందరు పోలీసు అధికారుల తీరు వివాదాస్పదంగా మారుతున్నది. శాంతి భద్రతలను పరిరక్షించడంతోపాటు ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సింది పోయి.. కట్టుతప్పుతుండడం చర్చనీయాశంగా మారుతున్నది. ఇటీవలి కాలంలో కొందరు అధికారులు, సిబ్బంది మరకలు అంటించుకుంటున్న తీరు పోలీస్ శాఖకే మచ్చ తెచ్చేలా ఉంటున్నది. తమ వ్యక్తిగత విషయాలతో పరువును బజారున పడేస్తుండగా.. ఆ శాఖ చర్యలు తీసుకుంటున్నా వ్యవహార శైలి మారడం లేదని తెలుస్తున్నది. అయితే, విధుల నిర్వహణే కాదు.. నైతికత ముఖ్యమనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నవి.

- కరీంనగర్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

ఖాకీకి మరకలు

- వివాదాస్పదంగా కొందరు అధికారులు, సిబ్బంది తీరు
- వ్యక్తిగత అంశాలతో పోలీస్ శాఖకే కళంకం
- సస్పెండ్ దాకా వెళ్తున్నా మారని వ్యవహార శైలి
- ఇటీవలి కాలంలో పెరిగిన సస్పెన్షన్లు, చర్యలు
- ప్రజల్లో అబాసుపాలవుతున్న వైనం
- విధుల నిర్వహణనే కాదు నైతికత ముఖ్యమేననే అభిప్రాయాలు

వివాహితను ట్రాప్ చేసి, సస్పెండ్

జిల్లాలోని ఓ ప్రముఖ ఆలయంలో అధికారిగా పనిచేసి, తర్వాత అదే క్షేత్రం ఉన్న నియోజకవర్గంలోని మరో మండలానికి బదిలీ అయి, అక్కడే కొన్నాళ్లు విధులు నిర్వర్తించాడు. అయితే, ఆ అధికారికి ఫేస్‌బుక్‌లో ఓ డైవోర్సీ మహిళ పరిచయమైంది. కొద్దిరోజులకే ఇద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. ఆ యువతి తనకు పెళ్లయిందని, భర్త నుంచి విడాకులు తీసుకున్నానని చెప్పింది. సదరు అధికారి మాత్రం తనకు వివాహమై, ఇద్దరు పిల్లలు ఉన్నా.. పెండ్లి కాలేదని చెప్పాడు. పెండ్లి చేసుకుంటానని చెప్పి ఆమెతో శారీరక సంబంధం కొనసాగించాడు. కొంత కాలం తర్వాత సదరు అధికారి క్రమంగా యువతితో మాట్లాడడం మానివేశాడు. ఆ యువతి తనను పెండ్లి చేసుకోవాలని ఒత్తిడి తేవడంతో విధులకు రాకుండా, సెల్‌ఫోన్ సైతం స్విచ్ఛాఫ్ చేసి కొన్నాళ్లు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. చివరకు ఆ యువతి జిల్లా ఉన్నతాధికారిని ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో సదరు అధికారి సస్పెండ్ కావడం సంచలనం సృష్టించింది.

ముగ్గురు పిల్లల తండ్రిది మరో కథ

ముగ్గురు పిల్లల తండ్రి అయిన ఓ అధికారిది మరో కథ. జగిత్యాల-కరీంనగర్ మధ్య ఉన్న ఓ మండలానికి అధికారిగా పనిచేశాడు. అదే కార్యాలయంలో పనిచేసే ఇద్దరు బిడ్డలున్న మహిళా ఉద్యోగితో సంబంధం పెట్టుకున్నాడు. సదరు ఉద్యోగికి తరుచూ రాత్రి డ్యూటీలు వేస్తుండేవాడు. ఈ విషయంలో సదరు మహిళకు, భర్తకు మధ్య కొంత వివాదం నెలకొంది. ఈ క్రమంలోనే ఒక రోజు రాత్రి తన భార్య ఆ అధికారితో రాత్రిపూట చాటింగ్ చేయడాన్ని భర్త గమనించాడు. ఉదయం ఇద్దరు పిల్లలను తీసుకొని కార్యాలయానికి వెళ్లాడు. సదరు అధికారి సెలవులో ఉన్నాడని తెలుసుకొని ఆగ్రహంతో బూతులు తిట్టి వెనుదిరిగాడు. తర్వాత నేరుగా జిల్లా కార్యాలయానికి చేరుకొని ఉన్నతాధికారికి ఫిర్యాదు చేశాడు. తన కాపురం, తన బిడ్డల పరిస్థితి ఎలా అంటూ..? రోదించాడు. దీంతో ఆ ఉన్నతాధికారి స్పందించి ఆ అధికారిపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. తర్వాత సదరు వివాదాస్పద అధికారిని ముందుగా జిల్లా కేంద్రానికి అటాచ్ చేయడం, అనంతరం సస్పెండ్ చేయడం పెద్ద చర్చనీయాంశమైంది.

రిటైర్‌మెంట్ వయసులో రంగేలీ చేష్టలు

ఆయనది రిటైర్‌మెంట్ వయసు. రెండు మూడు నెలల్లోనే విరమణ పొందాలి. కానీ, ఆయన తన చేష్టలతో సస్పెండ్ అయ్యాడు. నిజామాబాద్ మార్గంలో జగిత్యాల జిల్లాలోని చివరి మండలంలో బాధ్యతాయుతమైన ఉద్యోగం అతడిది. కొద్దిరోజుల క్రితం ఓ వివాహిత తన భర్త కొడుతున్నాడని స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. దానిపై విచారణ చేయాల్సిన బాధ్యత ఆ అధికారికి రావడంతో అవకాశంగా తీసుకున్నాడు. ఆ వివాహితతోనే సన్నిహిత సంబంధం పెట్టుకున్నాడు. ఇది సరికాదని తోటి ఉద్యోగులు చెప్పినా ఆయన వ్యవహారశైలిలో మార్పు రాలేదు. ఈ క్రమంలోనే వివాహితతో సదరు అధికారి సన్నిహితంగా ఉన్న ఫొటోలు ఆమె భర్తకు దొరకడంతో వాటిని ఫేస్‌బుక్‌తో పాటు వివిధ గ్రూపుల్లో షేర్ చేశాడు. ఈ విషయం ఉన్నతాధికారులకు చేరడంతో ఆ ఆరుపదుల వయసు దాటిన ఆ అధికారి సస్పెండ్ అయ్యాడు.

ఉన్నది కొన్ని రోజులే.. కానీ మోమో బయటికి..

ఓ గెజిటెడ్ స్థాయి అధికారి జగిత్యాల జిల్లాలో కొద్దిరోజులే పనిచేసినా ఇలాంటి వ్యవహారాన్నే నడిపి, చివరికి ఉన్నతాధికారితో ఛీవాట్లు తినడంతో పాటు చార్జీ మెమోను సైతం పొందినట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే.. ఓ మహిళాధికారి ఒక ఓ గెజిటెడ్ స్థాయి అధికారితో సాన్నిహిత్యంగా ఉండేది. సదరు అధికారి కొద్దిరోజులకే బదిలీపై వెళ్లిపోయాడు. తర్వాత కొత్తగా వచ్చిన అధికారి ఈ విషయం తెలుసుకొని సదరు మహిళాధికారితో ప్రవర్తించిన తీరు వివాదాస్పదంగా మారినట్లు తెలిసింది. అర్ధరాత్రి ఆ అధికారి ఫోన్లు చేసి ద్వంద్వార్థాలు వచ్చేలా మాట్లాడడంతో అవాక్కై, జిల్లా ఉన్నతాధికారికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో సదరు అధికారిని ఉన్నతాధికారి మందలించడంతోపాటు చార్జీ మెమో సైతం జారీ చేసినట్లు తెలిసింది.

ప్రియుడిని తరిమేసి యువతితో కాపురం

జగిత్యాల సబ్ డివిజన్‌లోని ఒక పుణ్యక్షేత్రం ఉన్న మండల రక్షణ కేంద్రంలో ఓ ఉద్యోగి పనిచేస్తున్నాడు. విధుల రీత్యా ఫిర్యాదుల స్వీకరణ ఆయన బాధ్యత. అయితే, ఓ రోజు తన తండ్రి తాగొచ్చి ఇంట్లో గొడవ చేస్తున్నాడని ఓ యువతి డయల్ 100కు ఫోన్ చేసింది. ఆ కాల్ రిసీవ్ చేసుకున్న సదరు ఉద్యోగి, ఫిర్యాదు చేసేందుకు కార్యాలయానికి రమ్మని ఆ యువతికి సూచించాడు. వచ్చిన తర్వాత ఆమెను చూసి మోజుపడ్డాడు. అప్పటికే వివాహితుడైనా.. ఆమెతో ఎలాగైనా సంబంధం పెట్టుకోవాలని భావించాడు. ఫిర్యాదుపై విచారణ కోసం మాటిమాటికి కార్యాలయానికి రప్పించి, ఆమె వ్యక్తిగత విషయాలన్నింటినీ తెలుసుకొన్నాడు. యువతికి ప్రియుడు ఉన్న విషయం తెలుసుకొని, వారి మధ్య పొరపొచ్చులు సృష్టించాడు. ప్రియుడిపై అత్యాచారం కేసు పెట్టేలా ఆ యువతిని ప్రోత్సహించి, తర్వాత అరెస్ట్ చేయించి, జైలుకు పంపించాడు. తర్వాత యువతితో సంబంధం పెట్టుకొని, ఆమెతో కాపురం పెట్టగా.. ఈ వ్యవహారంతో ఆయన కుటుంబం చిక్కుల్లో పడినట్టు తెలిసింది.

వివాదాస్పదంగా తీరు

కొద్ది రోజుల క్రితం జగిత్యాల సబ్ డివిజన్‌లో ఓ ఇద్దరు అధికారుల తీరు వివాదాస్పదమైంది. తన సర్కిల్ పరిధిలో పనిచేసే ఒక మహిళా అధికారితో మరో అధికారికి సన్నిహిత సంబంధం ఏర్పడింది. ఇద్దరు వివాహితులే కావడంతో ఇరువురి కుటుంబాల్లోనూ ఇది పెద్ద సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో అందులో ఒకరు తన జీవిత భాగస్వామిపై చేయి చేసుకోవడం, ఆ విషయం సంబంధిత శాఖలో పనిచేస్తున్న వారికి తెలిసి, ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడినట్లు తెలిసింది. కొద్దిరోజుల తర్వాత ఆ ఇద్దరు అధికారులు ఆ ప్రాంతం నుంచి బదిలీ అయినా, మళ్లీ ఒకే పరిధిలోకి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఈ సాన్నిహిత్యం వల్ల ఇద్దరు అధికారుల కుటుంబాల్లోనూ కలతలు రావడం, వారి కుటుంబాలు చిన్నాభిన్నమయ్యే పరిస్థితి ఉత్పన్నమైనట్లుగా తెలుస్తున్నది.

పార్టీ చేసుకొని..

ఇటీవల మల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుళ్ల తీరు చర్చనీయాశంమైంది. ఓ హెడ్ గత నెల 17న ఎస్ఐ ప్రధాని బందోబస్తులో ఉన్న సమయంలో ఒక హెడ్ కానిస్టేబుల్, మరో ఇద్దరు కానిస్టేబుళ్లతోపాటు స్థానిక రాజకీయ నాయకులు కొందరు కలిసి మందు పార్టీ చేసుకోవడం వైరల్ మారింది. ఈ విషయం ఎస్ఐ ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి చేరడంతో సమగ్ర విచారణ తర్వాత ఆ ముగ్గురిని సస్పెండ్ చేశారు. దీనికి వారం రోజుల ముందు అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఓ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు.

మరెన్నో..

తన పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఓ మహిళా ప్రొబేషనరీ ఎస్ఐని వలలో వేసుకునేందుకు ఓ సీఐ శతవిధాలా ప్రయత్నించాడు. దాంతో సదరు ఎస్ఐ జోన్ల మార్పిడిలో ఇతర జిల్లాను ఎంచుకొని అక్కడి నుంచి బయటపడిందనే విషయం అప్పట్లో పెద్ద దుమారమే రేపింది. అలాగే, ఓ మహిళా అధికారి, ఓ కానిస్టేబుళ్ల మధ్య నెలకొన్న బంధం సైతం అప్పట్లో జిల్లాలో రచ్చకెక్కింది. ఓ పుణ్యక్షేత్రానికి సమీపంలో ఉన్న ఓ మండలంలో పనిచేసిన సమయంలో అధికారి, ఓ మహిళా కానిస్టేబుల్‌తో అసభ్యంగా ప్రవర్తించాడు. తర్వాత ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కానీ, ఈ విషయం ఉన్నతాధికారులకు చేరడంతో ఆయనను సస్పెండ్ చేశారు.

ఆదరించండి.. మీకోసం ప్రశ్నించే గొంతుకవుతా

- కరీంనగర్‌ను అంతర్జాతీయ స్థాయి ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతా
- అభివృద్ధి చేసే వారికి ఓటేయండి
- కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

కార్పొరేషన్, ఏప్రిల్ 15: 'వచ్చే ఎంపీ ఎన్నికల్లో నన్ను ఆదరించండి. మీ ఓటువేసి గెలిపిస్తే కరీంనగర్ సెగ్మెంట్‌ను అంతర్జాతీయ స్థాయి ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతా' అని పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ హామీ ఇచ్చారు. కరీంనగర్ సమస్యలపై, రాష్ట్ర సమస్యలపై పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకనవుతానని చెప్పారు. నగరంలోని 60వ డివిజన్‌లో సోమవారం ఉదయం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొని, మాట్లాడారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో కరీంనగరానికి అర్హత లేకున్నా స్మార్ట్ సిటీలో చేర్చానని, రూ. వెయ్యి కోట్ల నిధులు తెచ్చి అభివృద్ధి చేసినట్లు వివరించారు. కొత్త పల్లి, మనోహరాబాద్ రైల్వేలైన్ తీసుకువచ్చానని, వచ్చే డిసెంబర్ నాటికి అది కరీంనగర్ చేరుకుంటుందన్నారు. నగరంలో టీటీడీ ద్వారా రూ.25 కోట్లతో వేంకటేశ్వర ఆలయం నిర్మాణం జరుగుతుందని చెప్పారు. ప్రస్తుత ఎంపీ బండి సంజయ్ ఐదేళ్ల కాలంలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో అభివృద్ధికి రూ.5 కూడా తీసుకురాలేదని విమర్శించారు. కరీంనగర్‌కు ఒక్క బడి, గుడి కూడా తీసుకురాలేకపోయారని మండిపడ్డారు. ప్రతి జిల్లాకు కేంద్ర ప్రభుత్వం నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాల్సి ఉందని, కానీ అది కూడా తీసుకురాలేకపోయారని దుయ్యబట్టారు. బండి సంజయ్‌కి పదవి మీద తప్ప ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి మీద ధ్యాస లేదని దుయ్యబట్టారు. తనను ఎంపీగా గెలిపిస్తే కరీంనగర్‌కు అంతర్జాతీయ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. అలాగే ట్రిపుల్ ఐటీ కోసం కూడా ప్రయత్నాలు చేస్తానన్నారు. కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా కరీంనగర్ అభివృద్ధికి నిధులు తీసుకువచ్చేందుకు, కొత్త ప్రాజెక్టులు తేచ్చేందుకు పోరాటం చేస్తానన్నారు. అలాగే రాజీవ్ రహదారిని, చొప్పదండి, మంచిర్యాల రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించే విధంగా కృషి చేస్తానని వివరించారు. అనునిత్యం నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడే వారికే ఓటు వేసి గెలిపించాలని కోరారు. తమకు అనేక ఆలోచనలున్నాయని, వాటిని నెరవేర్చే దిశగా పని చేస్తామన్నారు. తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ పార్లమెంట్‌కు ప్రశ్నించే గొంతుకగా వినోద్‌కుమార్‌ను పంపించాలని కోరారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉన్నా కొట్లాడి మరి అనేక ప్రాజెక్టులు సాధించారని గుర్తుచేశారు. సమావేశంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, కార్పొరేటర్ వాల రమణారావు, ఐలేందర్, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

420 హామీలతో కాంగ్రెస్ మోసం

- నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

సారంగాపూర్, ఏప్రిల్15: కాంగ్రెస్ పార్టీ 420 హామీలతో ప్రజలను మోసం చేసిందని నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ మండిపడ్డారు. మహిళలకు ఉచిత బస్సు మినహా ఒక్క హామీని అమలు చేయలేదని దుయ్యబట్టారు. సారంగాపూర్ మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో సోమవారం సా యంత్రం నిర్వహించిన బీఆర్ఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశానికి రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌తో కలిసి హాజరయ్యా రు. ఈ సందర్భంగా బాజిరెడ్డి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి చంద్రబాబు అనుచరుడని, ఇప్పుడున్నది డూప్లికేట్ కాంగ్రెస్, ఆర్ ఎస్ఎస్ కాంగ్రెస్ అని విమర్శించారు. జీవన్‌రెడ్డికి ఈ ప్రాంత యువత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తే, ఆ పదవికి న్యాయం చేయాల్సింది పోయి మొన్న ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయి, ఇప్పుడు ఎంపీగా పోటీ చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్సీగా ఉండి నిరుద్యోగుల కోసం ఏం చేశారో.. చెప్పాలని ప్రశ్నించారు. ఎంపీ అర్వింద్ ఏ ఒక్క పనైనా చేశాడా..? అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసినా పాపాన పోలేదని, ఆయనకు ఓట్లతో ప్రజలు సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేడీసీఏ ప్రతినిధులు

20 నుంచి క్రికెట్ శిక్షణ శిబిరాలు

కొత్తపల్లి, ఏప్రిల్ 15 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్ఏ)కు అనుబంధమైన కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్(కేడీసీఏ) ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉచిత వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు కేడీసీఏ అధ్యక్షుడు ఆగం రావు తెలిపారు. సోమవారం శిక్షణ శిబిరాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను క్రికెట్ సంఘం కార్యాలయంలో ఆవిష్కరించి, వివరాలు వెల్లడించారు. అండర్-14, అండర్-16, అండర్-19, అండర్-23 విభాగాల్లో బాలబాలికలకు వేరువేరుగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు నిపుణులైన కోచ్‌ల ఆధ్వర్యంలో కొనసాగుతాయన్నారు. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, గోదావరిఖని, రాజన్న సిరిసిల్లలో శిబిరాలు ఏర్పాటు చేయనున్నామని, ఈ నెల 20 నుంచి మే 20 వరకు కొనసాగుతాయన్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఉచిత శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణ శిబిరాల్లో ప్రతిభ కనబరిచే క్రీడాకారులకు హెచ్‌సీఏ, కేడీసీఏ ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా, రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు తమ పేర్లను WWW.hycricket.org వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయి తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 16 నుంచి 18 లోపు అర్హులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 80087 29397 నెంబర్‌లో సంప్రదించాలన్నారు. సమావేశంలో క్రికెట్ సంఘం కార్యదర్శి ఎన్ మురళీధర్‌రావు, పీ మనోహర్‌రావు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై నియంత్రణేది?

పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

మంథని, ఏప్రిల్15 : ఇసుక అక్రమ రవాణాపై నియంత్రణ కరువైందని పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇసుకను దోచుకుపోతున్నారని మాట్లాడిన అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి, ప్రస్తుత మంత్రి.. ఇసుకను ఎవరు దోచుకుపోతున్నారో ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం ఇసుక లారీలతో ఛిద్రమైన మంథని -పెద్దపల్లి ప్రధాన రహదారిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మధూకర్ మాట్లాడుతూ, నాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో అనేక అబద్ధాలు చెప్పిన ప్రస్తుత మంత్రి ఇప్పుడు ఇసుక అక్రమ తరలింపుపై ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక రకంగా, అధికారంలో లేనప్పుడు మరో రకంగా మాట్లాడడం సిగ్గు చేటన్నారు. అట్టడుగు కుటుంబం నుంచి పైకి వస్తే ఓర్వలేక తనపై అనేక అసత్య ఆరోపణలు చేసి ప్రజలకు దూరం చేశారని వాపోయారు. ఇసుక క్వారీలు, లారీలు తనవేనని ప్రచారం చేశారని, ప్రస్తుతం వందల కొద్ది లారీలు అక్రమంగా ఓవర్ లోడ్‌తో వెళ్తున్నవి ఎవరివో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇసుక రవాణాతో రోడ్డు మొత్తం పగిలిపోతున్నదని తెలిపారు. అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేస్తే అక్కడక్కడ ఒకటి రెండు లారీలను పట్టుకుంటున్నారని, కానీ వందల కొద్ది లారీలు ఓవర్ లోడ్ వెళ్తున్నాయని ఆరోపించారు. గత ప్రభుత్వంలో నీళ్ల కింద ఇసుక వృథాగా పోవద్దని, కేసీఆర్ సర్కార్ ఇసుక తీసి ప్రజల అవసరాలకు వినియోగించడంతో పాటు ప్రభుత్వ ఖజానాకు డబ్బులు జమ చేసిందని గుర్తు చేశారు. ఇప్పుడు ఇసుక క్వారీలు, లారీల డబ్బులు కాంగ్రెస్ నాయకుల జేబుల్లోకి వెళ్తున్నాయని వాపోయారు. ఇసుక, బియ్యం, స్క్రాప్ , బెల్లం దందాలకు కాంగ్రెస్ నాయకులు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తే, మంత్రి సోదరుడు నాయకత్వం వహిస్తున్నాడని ఆరోపించారు. ఇసుక రవాణా ఆపాలని సుల్తానాబాద్‌లో అన్ని పార్టీల నాయకులు దీక్ష చేస్తున్నారని, అదే తరహాలో మంథనిలో కాంగ్రెస్ నాయకులు దీక్ష చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తగరం శంకర్‌లాల్, ఏగోలపు శంకర్‌గౌడ్, కాయితి సమ్మయ్య, గొబ్బూరు వంశీ, ఆసిఫ్ పాల్గొన్నారు.

మంథనిలో ప్రధాన రహదారిని పరిశీలిస్తున్న జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

తెలంగాణ రాష్ట్ర సర్వాయిపాపన్న గీత కార్మిక సంఘం నూతన అధ్యక్షుడు కోడూరి పరశురామ్‌గౌడ్‌ను సత్కరిస్తున్న గౌడ సంఘం నాయకులు

రాష్ట్ర అధ్యక్షుడిగా పరశురామ్‌గౌడ్

తెలంగాణచౌక్, ఏప్రిల్ 15 : తెలంగాణ రాష్ట్ర సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కోడూరి పరశురామ్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు వీరగోని పెంటయ్య సమక్షంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయనను ఎనుకున్నారు. ఈ సందర్భంగా పురశురామ్ గౌడ్ మాట్లాడుతూ గీత కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సామరస్యంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రమాదవశాత్తు గాయపడిన గీత కార్మికులకు చిక్సిత కోసం అందించే ఆర్థిక సహాయం రూ.50 వేలు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ప్రతి గీత కార్మిక సొసైటీకి ఐదెకరాలతోపాటు ఈత వనం కోసం మొక్కలను ఉచితంగా అందించాలని కోరారు. అనంతరం నూతన అధ్యక్షుడిని గౌడ సంఘం నాయకులు ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో గౌడ సంఘం నాయకులు కలర్ సత్తన్న, మల్లేశం గౌడ్, రాజేశ్‌గౌడ్, లింగయ్య గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల మెడపై కేంద్రం కత్తి

- పథకం ఎత్తివేతకు మరో కుట్ర
- కూలి చెల్లింపుల ఆధారంగా కాంపోనెంట్ నిధులు
- నిబంధనల్లో పలు మార్పులు చేసిన కేంద్రం

కలెక్టరేట్, ఏప్రిల్ 15 : ఉపాధిహామీ పథకం ఎత్తివేతకు కేంద్రం మరో కుట్రకు తెరతీసింది. ఓ వైపు కూలి పెంచినట్టుగా చెబుతూనే, మరోవైపు చెల్లింపుల ఆధారంగానే కాంపోనెంట్ నిధులు విడుదల చేసేందుకు నిర్ణయించింది. ఎంత పనిచేస్తే అంతే చెల్లింపులు చేసేలా, క్రమం తప్పకుండా ఉపాధిహామీ పనికి వచ్చే వారికే చెల్లింపులు చేసేలా నిబంధనల్లో మార్పులు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసి, కూలీల మెడపై కత్తి పెట్టింది. కేంద్రం అనుసరిస్తున్న విధానాలతో ఇప్పటికే జిల్లాలో వేలాది మంది కూలీలు ఉపాధి పనులకు దూరం కాగా, తాజాగా అమలు చేయనున్న నిర్ణయంతో ఉపాధి కూలీల సంఖ్య జిల్లాలో మరింత తగ్గనుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో నిర్దేశించిన మేరకు కూలీలు పనులు చేసుకుని వెళ్ళేవారు. మిగతా సమయంలో ఇతర పనులు చేసుకుంటూ, అంతో ఇంతో సంపాదించుకునేవారు. అయితే, ప్రస్తుత నిబంధనలతో అధికారులు, ఉపాధి మేట్‌లు చెప్పిన సమయంలో మాత్రమే పనులు చేయాల్సి ఉంటుంది. దీంతో, పొద్దంతా ఉపాధి పనికే సమయమివ్వాల్సి ఉంటుంది. కేవలం రూ.28 మాత్రమే పెంచి, రోజంతా పని స్థలంలో ఉండేలా ఆదేశాలు జారీ చేయడం వెనుక ఆంతర్యమేంటనే ప్రశ్న కూలీల నోటి నుంచి వస్తోంది. అలవికాని నిబంధనలు అమలు చేస్తూ కూలీలను పనికి దూరం చేసి, ఈ పథకానికి మంగళం పాడవచ్చనే భావనతోనే కేంద్రం ఈ చర్యలకు పాల్పడుతోందనే విమర్శలు వస్తున్నాయి. ఏడాదిలో ఎప్పుడైనా వంద రోజుల పని దినాలు కల్పించాల్సి ఉంటుంది. అయితే, ఇందుకు విరుద్ధంగా కేవలం వేసవిలో మాత్రమే ఉపాధి పనులు చేసేలా, కూలీలపై ఒత్తిడి తెస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అయితే, ఎండ వేడి భరించలేక కూలీలు పనులకు రాలేక పోతున్నారు. ఈ కారణంగా వారికి భత్యం చెల్లింపులపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ఇప్పటివరకు 1,22,988 కుటుంబాలకు జాబ్ కార్డులుండగా, 58,825 కుటుంబాల్లోని కూలీలకు గత ఆర్థిక సంవత్సరంలో పనులు కల్పించారు. ఇందులో కేవలం 7 వేల కుటుంబాలు మాత్రమే వంద రోజులు పూర్తి చేసుకోగా, మిగతా వారికి నామమాత్రంగానే పనులు కల్పించినట్లు అధికారుల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కొత్తగా అమల్లోకి వచ్చిన నిబంధనల ప్రకారం రాబోయే రోజుల్లో ఉపాధి కూలీలకు పని కల్పన ఇక గగనమే అని కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.